# ఆధునిక భారతదేశ చరిత్ర

## సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాలు

### ఈశ్వరచంద్ర విద్యాసాగర్ (1820 - 91)

ఈయన 1820లో బెంగాల్‌లోని వీరసింఘ అనే గ్రామంలో జన్మించారు. తన సంస్కృత సాహితీ ప్రతిభ వల్ల కలకత్తా సంస్కృత కళాశాల నుంచి 'విద్యాసాగర్' అనే బిరుదును పొందారు. స్త్రీ విద్యాభివృద్ధికి, వితంతు వివాహాలు చట్టబద్ధం కావడానికి కృషి చేశారు. కలకత్తా మెట్రో పాలిటన్ కళాశాలను స్థాపించారు. 'వితంతు వివేకము' అనే గ్రంథాన్ని రచించారు. తన కుమారుడికి వితంతువుతో వివాహం జరిపించారు. ఇతడి కృషి ఫలితంగానే 1856లో వితంతువును వివాహం చేసుకున్న వ్యక్తికి ఆస్తి హక్కును కల్పించే చట్టాన్ని డల్హౌసీ చేశారు. విద్యా సాగరుడు 'బెంగాల్ చరిత్ర', 'సత్పురుషుల చరిత్ర', 'సీతా వనవాసము' గ్రంథాలను రాశారు. ఈయన రూపొందించిన బెంగాలీ ప్రాథమిక వాచకం ఇప్పటికీ వాడుకలో ఉంది. 1856, డిసెంబరు 7న దేశంలోనే మొదటి వితంతు వివాహాన్ని కలకత్తాలో జరిపించారు. 1856 – 60 సంవత్సరాల మధ్య విద్యాసాగరుడు సుమారు 20 వితంతు వివాహాలను జరిపించారు. 1849లో స్త్రీ విద్యాభివృద్ధికి స్థాపించిన బెథూనిన్ పాఠశాలకు కార్యదర్శిగా కూడా పనిచేశారు. బెంగాల్‌లోని శాంతిపూర్ చేనేత కార్మికులు చీర అంచుపై 'విద్యాసాగరుడు వర్ధిల్లు గాక' అని నేశారట. అంతటి గొప్ప సాంఘిక సంస్కర్త విద్యాసాగరుడు.

### ప్రార్థనా సమాజ్ (1867)

ఆత్మారాం పాండురంగ 1867లో బొంబాయిలో ప్రార్థనా సమాజ్‌ను స్థాపించారు. ఎం.జి. రనడే, ఆర్.జి. భండార్కర్‌లు స్థాపక సభ్యులుగా ఉన్నారు. వీరు మతోద్ధరణ కంటే సంఘ సంస్కరణకు అధిక ప్రాధాన్యమిచ్చారు. కార్మికులకు, మహిళలకు రాత్రి పాఠశాలను నెలకొల్పి విద్యాభివృద్ధికి కృషి చేశారు. ఎం.జి. రనడే 'దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ'ని స్థాపించి, వితంతు వివాహ సంఘాన్ని నెలకొల్పారు. ప్రార్థనా సమాజ్ మూల సూత్రాలకు వివరణ కల్పించింది ఎం.జి. రనడే. ప్రార్థనా సమాజ్ మహిళా విభాగంలో పండిత రమాబాయి సరస్వతి విశేష కృషి చేసింది. కోస్తా ఆంధ్రాలో కూడా ప్రార్థనా సమాజం ప్రాచుర్యాన్ని పొందింది. (తారాచంద్ రాసిన గ్రంథంలో ప్రార్థనా సమాజాన్ని స్థాపించింది 1867 అని, తెలుగు అకాడమీ పుస్తకాల్లో 1869 అని ప్రచురితమై ఉంది.)

వాస్తవానికి బొంబాయిలో మత సంస్కరణకు 1840లోనే శ్రీకారం చుట్టిన సంస్థ పరమహంస మండలి. పశ్చిమ భారతదేశంలో మొదటి సంఘ సంస్కర్తగా పేరొందిన గోపాల్ హరిదేశ్‌ముఖ్ ఈ సంస్థ ద్వారా సంఘ సంస్కరణకు కృషిచేశారు. ఈయన లోకహిత వాది అనే బిరుదు పొందాడు. ఈయన విగ్రహారాధన, వర్ణ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడారు. 'పురోహితులు మహా అపవిత్రులు. పండితులు పురోహితులకంటే భ్రష్టులు, అజ్ఞానులు, అహంకారులు. మానవులంతా సమానులనీ, ప్రతి ఒక్కరికీ జ్ఞానాన్ని సంపాదించే హక్కు ఉందని వాళ్లు ఆమోదించాలి' అని ఎలుగెత్తిచాటిన వ్యక్తి గోపాల్ హరిదేశ్‌ముఖ్.

### ఆర్య సమాజం

ఆర్య సమాజాన్ని 1875, ఏప్రిల్ 10న బొంబాయిలో స్వామి దయానంద సరస్వతి స్థాపించారు. దయానందుడి అసలు పేరు మూల్ శంకర్. ఈయన 1824లో గుజరాత్‌లో ఉన్న మోర్వి ప్రాంతంలో టంకార్ అనే గ్రామంలో జన్మించారు. శృంగేరి మఠానికి చెందిన పరమానంద సరస్వతి వద్ద దీక్ష స్వీకరించి, సన్యాసిగా మారాడు. తన పేరును దయానంద సరస్వతిగా మార్చుకున్నారు. మథురలోని విరజానంద స్వామి వద్ద వేదాల్లోని సత్యాన్ని తెలుసుకున్నారు. ఆర్య సమాజం తరఫున 10 సూత్రాలను హిందీ భాషలో ప్రచారం చేశారు. కానీ దయానంద సరస్వతి సంస్కృత భాషలోనే తన రచనలు చేశారు. 'సత్యార్థ ప్రకాశిక' అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించారు. 'రుగ్వేద భాష్య భూమిక' అనే గ్రంథాన్ని కూడా రాశారు. 1882లో గోరక్షణ సభను స్థాపించారు. 'వేదాలకు మరలండి' (Go Back to Vedas) అనే నినాదాన్ని ఇచ్చారు. 'భారతదేశం భారతీయులకే' అని ప్రకటించారు. ఇతర మతాల్లోకి వెళ్లిన హిందువులను తిరిగి హిందూ మతంలోకి తీసుకురావడానికి శుద్ధి ఉద్యమాన్ని ప్రారంభించారు. 'ఆంగ్లేయుల నుంచి ప్రభుత్వం కంటే భారతీయుల స్వపరిపాలన మరెంతో మంచిది' అని వ్యాఖ్యానించారు. 1883లో దయానంద సరస్వతి మరణం తర్వాత 1886లో లాహోర్‌లో దయానంద్ ఆంగ్లో వేదిక్ కళాశాలను స్థాపించారు. స్వామి శ్రద్ధానంద నాయకత్వంలో ఆర్య సమాజం కొనసాగింది. కానీ 1892లో ఆర్య సమాజం గురుకుల, కళాశాల వర్గాలుగా చీలిపోయింది. గురుకుల వర్గానికి స్వామి శ్రద్ధానంద నాయకత్వం వహించగా, కళాశాల వర్గానికి లాలా హన్సరాజ్, శయన దాస్, లాలా లజపతిరాయ్‌లు నాయకత్వం వహించారు. స్వామి శ్రద్ధానంద అసలు పేరు మున్షీ రామ్. గురుకుల వర్గం హరిద్వార్ కేంద్రంగా కాంగ్రీ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి, సేవలు కొనసాగించగా, కళాశాల వర్గం లాహోర్ కేంద్రంగా పనిచేసింది. నాటి ఆర్య సమాజ కృషిని, ఉద్యమ ప్రచారాన్ని గమనించిన ప్రముఖ ఆంగ్ల పాత్రికేయులు వాలెంటైన్ చిరోల్



R-23-10-18

(టైమ్స్ పత్రిక) 'బ్రిటిష్ సార్వభౌమాధికారానికి ఆర్య సమాజ్ ప్రమాదికారి కాగలదు' అని పేర్కొన్నాడు. హైదరాబాద్ కేంద్రంగా ఆర్య సమాజ్‌ను నడిపింది స్వామి రామానందతీర్థ. హైదరాబాద్ నిజాం రాజ్యంలో ఆర్య సమాజ్ సాంఘిక, మత సంస్కరణలతోపాటు జాతీయ చైతన్యాన్ని కూడా ప్రచారం చేసింది. స్వామి వివేకానందుడు ఉపనిషత్తులకు, దయానంద సరస్వతి వేదాలకు అధిక ప్రాధాన్యమిచ్చారు.

## ఆంధ్రాలో బ్రహ్మ సమాజం

బ్రహ్మ సమాజ సేవలను దక్షిణ భారతదేశానికి కేశవ చంద్రసేన్ విస్తరించినట్లుగా పేర్కొంటారు. 1878లో మన్నవ బుచ్చయ్య పంతులు బ్రహ్మ సమాజంలో చేరారు. ఉత్తర సర్కారు ప్రాంతానికి చెందిన రాజా గజపతిరావు ధన సహాయంతో బ్రహ్మసమాజ మందిరాన్ని ఏర్పాటు చేశారు. రఘుపతి వేంకటరత్నం నాయుడు కాకినాడలోని పిఠాపురం రాజా కళాశాల (పి.ఆర్. కళాశాల) ప్రధానాచార్యుడిగా పనిచేసి అక్కడ బ్రహ్మ సమాజ సిద్ధాంతాలు, సంస్కరణలను ప్రచారం చేశారు. బ్రహ్మధర్మ ప్రచారక నిధిని ఏర్పాటు చేశారు. కాకినాడలో బ్రహ్మ మందిరం, అనాథ శరణాలయాలను స్థాపించారు. సాంఘిక శుద్ధి ఉద్యమాన్ని ప్రారంభించి దేవదాసీ వ్యవస్థ నిర్మూలనకు కృషి చేశారు. ఆంధ్రదేశంలో రాజమండ్రి కేంద్రంగా బ్రహ్మ సమాజ సేవలను అందించిన వ్యక్తి కందుకూరి వీరేశలింగం. ఈయన గొప్ప సంఘ సంస్కర్త, రచయిత, పాత్రికేయుడు. స్త్రీ విద్యాభివృద్ధికి, వితంతువుల ఉద్ధరణకు జీవితాంతం కృషి చేశారు. హితకారిణీ సమాజం, వితంతు శరణాలయం, బాలికా పాఠశాలలు నెలకొల్పి ఆంగ్ల ప్రభుత్వంతో 'రావు బహద్దూర్' బిరుదును పొందారు. ఆంధ్రదేశంలో తొలి వితంతు వివాహాన్ని 1881, డిసెంబరు 11న రాజమండ్రిలో జరిపించారు.

## మాదిరి ప్రశ్నలు

**1.** 1815లో రాజా రామ్మోహన్‌రాయ్ స్థాపించిన సంస్థ?

1) బ్రహ్మసమాజం  2) బ్రహ్మసభ
3) ఆత్మీయసభ  4) ఏదీకాదు

**2.** బ్రహ్మసమాజంలో చీలిక ఏర్పడిన సంవత్సరం?

1) 1865  2) 1866  3) 1891  4) 1892

**3.** 'వేదాలకు మరలండి' అనే నినాదాన్ని ఇచ్చింది?

1) రాజా రామ్మోహన్‌రాయ్  2) స్వామి దయానంద సరస్వతి
3) స్వామి వివేకానంద  4) స్వామి శ్రద్ధానంద

**4.** 'ఖురాన్ వైపునకు మరలండి' అన్నది ఎవరు?

1) నవాబ్ అబ్దుల్ లతీఫ్  2) సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్
3) రషీద్ గంగోవాలా  4) షరియతుల్లా

**5.** 'మానవసేవే మాధవసేవ' నినాదం ఏ సంస్థకు చెందింది?

1) బ్రహ్మసమాజం  2) ఆర్యసమాజం
3) ప్రార్థనా సమాజం  4) రామకృష్ణ మిషన్

**6.** 'భారతదేశం భారతీయులకే' అనే నినాదాన్ని ఇచ్చింది?

1) స్వామి వివేకానంద  2) స్వామి దయానంద
3) రామకృష్ణ పరమహంస  4) మున్షీరాం

**7.** రాజా రామ్మోహన్‌రాయ్ జీవిత చరిత్రను రాసింది?

1) విలియం డిగ్బే  2) మాక్స్ ముల్లర్
3) సోఫియా డాబ్సన్‌కోలెట్  4) ఎవరూ కాదు

**8.** 'బాల్య వివాహాల రద్దు' చట్టం చేయడానికి కృషి చేసింది?

1) రాజా రామ్మోహన్‌రాయ్ 2) ఈశ్వరచంద్ర విద్యాసాగర్

3) రామచంద్ర విద్యావాగీష్ 4) కేశవచంద్రసేన్

**9.** కింది అంశాలను జతచేయండి.

i) ప్రార్థనా సమాజం ఎ) 1897

ii) ఆర్యసమాజం బి) 1867

iii) రామకృష్ణ మిషన్ సి) 1875

iv) బ్రహ్మసమాజం డి) 1828

1) i-ఎ, ii-బి, iii-సి, iv-డి 2) i-బి, ii-ఎ, iii-డి, iv-సి

3) i- బి, ii-సి, iii-ఎ, iv- డి 4) i-డి, ii-సి, iii-బి, iv-ఎ

**10.** సంగత్ సభ/ సంగీత సభను స్థాపించింది?

1) కేశవ చంద్రసేన్ 2) ఆత్మారాం పాండురంగ

3) రాజా రామ్మోహన్‌రాయ్ 4) దయానంద సరస్వతి

**11.** ఆంధ్రదేశంలో తొలి వితంతు వివాహం జరిగిన తేది?

1) 1881, డిసెంబరు 11 2) 1882, నవంబరు 11

3) 1856, డిసెంబరు 7 4) ఏదీకాదు

**12.** బెంగాలీ ప్రాథమిక వాచకాన్ని రాసింది?

1) కేశవ చంద్రసేన్ 2) ఈశ్వరచంద్ర విద్యాసాగర్

3) స్వామీ దయానంద సరస్వతి 4) రాజా రామ్మోహన్‌రాయ్

**13.** భారతదేశంలో వితంతు వివాహాలు చట్టబద్ధం చేయడానికి కృషి చేసినవారు?

1) ఈశ్వరచంద్ర విద్యాసాగర్ 2) కేశవచంద్రసేన్

3) రాజా రామ్మోహన్‌రాయ్ 4) స్వామీ దయానంద సరస్వతి

**14.** ఈ కింది అంశాలను జతపర్చండి.

i) గదాధరుడు ఎ) రామకృష్ణ పరమహంస

ii) మూల్ శంకర్ బి) స్వామి శ్రద్ధానంద్

iii) మున్షీరాం సి) స్వామి వివేకానంద

iv) నరేంద్రనాథ్‌దత్ డి) స్వామి దయానంద

1) i-ఎ; ii-బి; iii-సి; iv-డి 2) i-బి; ii-ఎ; iii-డి; iv-సి

3) i-ఎ; ii-డి; iii-బి; iv-సి 4) i-డి; ii-బి; iii-ఎ; iv-సి

**15.** 'వితంతు వివేకము' అనే గ్రంథాన్ని రాసింది?

1) స్వామి వివేకానంద 2) స్వామి దయానంద

3) కేశవ చంద్రసేన్ 4) ఈశ్వరచంద్ర విద్యాసాగర్

www.eenadupratibha.net

**16.** 'బ్రహ్మ ధర్మము' అనే గ్రంథాన్ని రచించింది?

1) కేశవచంద్రసేన్ 2) దేవేంద్రనాథ్ ఠాగూర్

3) స్వామి శ్రద్ధానంద 4) ఎవరూ కాదు

**17.** రాజా రామ్మోహన్‌రాయ్ నడిపిన బెంగాలీ పత్రిక?

1) మిరాతుల్ అక్బర్ 2) సంవాద కౌముది

3) ది బెంగాలీ 4) వంగ పత్రిక

**18.** భారతదేశంలో తొలి వితంతు వివాహాన్ని జరిపించింది ఎవరు?

1) కేశవచంద్రసేన్ 2) కందుకూరి వీరేశలింగం

3) ఈశ్వరచంద్ర విద్యాసాగర్ 4) డి. కె. కార్వే

**సమాధానాలు**

1-3; 2-2; 3-2; 4-2; 5-4; 6-2; 7-3; 8-4; 9-3; 10-1; 11-1; 12-2; 13-1; 14-3; 15-4; 16-2; 17-2; 18-3.

**రచయిత: బొత్స నాగరాజు**

www.eenadupratibha.net